www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 14 మే 2024 | 8 పేజీలు

తూర్పుగోదావరి కాకినాడ కోనసీమ

ఉమ్మడి 'తూర్పు'లో పోలింగ్ ఇలా...

8.47 %	9 am
22.70 %	11 am
40.05 %	1 pm
51.26 %	3 pm
64.30 %	5 pm
72.71 %	6 pm

పోలింగ్ ప్రశాంతం

- కాకినాడలో 73.33 శాతం పోలింగ్
- కోనసీమలో 81.92 శాతం
- తూర్పు గోదావరిలో 62.89 శాతం
- పలుచోట్ల మొరాయించిన ఇవిఎంలు
- కొన్నిచోట్ల సౌకర్యాల లేమితో ఇబ్బందులు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సోమవారం చెదురుమొదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. మూడు జిల్లాలవ్యాప్తంగా సాయంత్రం 6 గంటల వరకూ కాకినాడ జిల్లాలో 73.33 శాతం, కోనసీమలో 81.92 శాతం, తూర్పు గోదావరి జిల్లాలో 62.89 శాతం పోలింగ్ జరిగినట్లు జిల్లా కలెక్టర్లు తెలిపారు.

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో 21 నియోజకవర్గాల్లో మొత్తం 4,858 పోలింగ్ స్టేషన్లు ఉండగా పలు కేంద్రాల్లో రాత్రి 9 గంటల వరకూ కూడా ఓటింగ్ కొనసాగింది. జిల్లావ్యాప్తంగా అనేక చోట్ల ఇవిఎంలు మొరాయించడంతో గంటల తరబడి పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. కాకినాడ రూరల్ కరప, పిఠాపురం, సామర్లకోట, తుని, కాకినాడ సిటీ తదితర ప్రాంతాల్లో ఇవిఎంలు మొరాయించిన నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ఓటర్లు బారులు తీరారు. తొలుత ఉదయం 5 గంటల తర్వాత మాక్ పోలింగ్ నిర్వహించారు. అభ్యర్థులు, ఏజెంట్లు, అధికారుల సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహించిన అనంతరం ప్రతి ఇవిఎంలోనూ 50 ఓట్లను ఏజెంట్లు, అధికారుల సమక్షంలో ప్రిసైడింగ్ అధికారులు లెక్కించారు. అనంతరం ఆ ఓట్లు తొలగించి యంత్రాలకు సీల్ వేశారు. కొన్నిచోట్ల సాంకేతిక లోపాలు తలెత్తగా అప్పటికప్పుడు అధికారులు వాటిని సరి చేశారు.

పోలింగ్ కొనసాగిందిలా...

కాకినాడ జిల్లాలో మొత్తం 16,34,122 మంది ఓటర్లుండగా సాయంత్రం 6 గంటల వరకూ 11,21,191 మంది తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. 68.61 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఉదయం 9 గంటలకు 1,43,515 మంది ఓటు వేయగా 8.78 శాతం, 11 గంటలకు 38,68,95 మంది ఓటు వేయగా 23.68 శాతం, మధ్యాహ్నం 1 గంట వరకూ 38.89 శాతం, 3 గంటకు 87,5,908 మంది వేయగా 53.60 శాతం, సాయంత్రం 5 గంటలకు 10,36,438 మంది వేయగా 63.42 శాతం, 6 గంటలకు 11,22,753 మంది వేయగా 68.71 శాతం నమోదయ్యిందని

2లో..

పెరవలిలో బారులుతీరిన ఓటర్లు

ఓటు వేసిన వికలాంగురాలు

కార్టూ'నిజం'



పల్లం గ్రామంలో కొట్లాట

ముగ్గురికి తీవ్ర గాయాలు

బలుసుతిప్ప, కుండలేశ్వరంలో ఉద్రిక్తతలు

ప్రజాశక్తి-కాట్రేనికోన, అమలాపురం రూరల్

ఎన్నికల నేపథ్యంలో తీరప్రాంత మత్స్యకార గ్రామమైన పల్లంలో ఘర్షణలు చెలరేగాయి. వైసిపి, తెలుగుదేశం పార్టీ వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం తెలుగుదేశం పార్టీ, వైసిపి వర్గీయులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దీంతో ఇరువర్గాలు ఇటుక రాళ్లతో దాడులకు తెగబడడంతో వైసిపికి చెందిన మల్లడి చిన ధర్మారావు, మల్లాడి నరసింహ, మల్లాడి సతీష్‌కు తీవ్రమైన గాయాలయ్యాయి. పలువురి ఇళ్ల అద్దాలు ధ్వంసం అయ్యాయి. గాయపడిన వారిని పోలీసులు ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వారిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గ్రామంలో అల్లర్లు చెలరేగకుండా అమలాపురం డిఎస్‌పి ఆధ్వర్యాన పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. మరో మత్స్యకార గ్రామమైన బలుసుతిప్పలో వైసిపి, టిడిపి మధ్య కవ్వింపు చర్యలు జరగడంతో స్వల్ప ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇరుపార్టీల నాయకులు గ్రామంలోకి వచ్చి వెళ్లిన తరువాత కార్యకర్తలు ఘర్షణకు దిగారు. మరో గ్రామం కుండలేశ్వరంలో వైసిపి, తెలుగుదేశం కార్యకర్తల మధ్య వాగ్వివాదం జరిగి తోపులాట జరిగింది. ఈ ఘటనలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు స్వల్ప గాయాలవడంతో ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని అనంతరం కాట్రేనికోన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అమలాపురం రూరల్ నడిపూడిలో రెండు వర్గాల మధ్య ఉద్రిక్తత

పల్లం గ్రామంలో ఘర్షణలో గాయపడిన వ్యక్తి

అమలాపురం మండలం మండలం నడిపూడి గ్రామంలోని 13,14 పోలింగ్ బూత్‌ల వద్ద ఇరు వర్గాల మధ్య తోపులాట, ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలింగ్ బూత్‌ల వద్ద వృద్ధులకు టిడిపి కార్యకర్తలు గుర్తులు చెబుతున్నారంటూ వైసిపి కార్యకర్తలు అడ్డుకున్నారు. వైసిపి, టిడిపి కార్యకర్తల మధ్య తోపులాటతో పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్ది చెప్పారు.

'తూర్పు'లో పోలింగ్ ప్రశాంతం

ప్రజాశక్తి-యంత్రాంగం

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తూర్పుగోదావరి జిల్లాలో సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఎన్నికల అధికారులు తెలిపారు. **రాజమహేంద్రవరం రూరల్:** సోమవారం ఉదయం కలెక్టరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని కలెక్టరు పర్యవేక్షించారు. అనంతరం స్థానిక కంబాల పేట చున్నీ లాల్ జాజు రోటరీ మునిసిపల్ కార్పొరేషన్ హై స్కూల్ నందు తన కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలోని 1577 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం 5.30 గంటలకు పోలింగ్ సిబ్బంది మాక్ పోల్ నిర్వహించారన్నారు. ఉదయం 7 గంటల నుంచి రెగ్యులర్ పోలింగ్ ప్రారంభించారన్నారు. పోలింగ్ ఏజెంట్లను కూడా అన్ని రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నూరు శాతం వెబ్ క్యాస్టింగ్ కొరకు కెమెరాలను పోలింగ్ కేంద్రాలు లోపల, బయట కూడా ఏర్పాటు చేశామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలను కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారని అన్నారు. ఉదయం 5 గంటల నుంచి కంట్రోల్ రూమ్ నుంచి పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షణా చేస్తున్నా మన్నారు. జిల్లా ఎస్‌పి, ఇతర ఇబ్బంది సమన్వయంతో పోలింగ్ సజావుగా పారదర్శకంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఎక్కడా ఎటువంటి సంఘటనలు జరగలేదని సజావుగా పోలింగ్ ప్రక్రియ జరుగుతున్నట్లు తెలిపారు. వేసవిని దష్టిలో ఉంచుకొని ప్రతి పోలింగ్ స్టేషన్ లో తాగునీరు, నీడ కొరకు షామియానాలు ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లు పెద్ద ఎత్తున తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని కలెక్టరు తెలిపారు. ఈసారి ఓటింగు శాతం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. **రాజానగరం:** నియోజకవర్గంలో 2,16,491 ఓట్లు ఉన్నాయి. చిన్న చిన్న సంఘటలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ప్రారంభం నుండి ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరారు. ఉదయం 7 గంగల నుండి 9 గంటలకు 7.81 శాతం 16,916 మంది. 9 గంటల నుండి 11 గంటలకు 22.91 శాతం 49,592 ఓట్లు, 11గంటల ఒంటిగంట వరకు 33.64 శాతం 72,837 ఓట్లు, ఒంటిగంట నుండి 3 గంటల వరకు 54.16 శాతం 1,17,260 ఓట్లు, 3 గంటల నుండి 5 గంటల వరకు 68.71 శాతం 1,48,750 ఓట్ల పోలైనాయి. సాయంత్రం 6 గంటలు దాటిన తర్వాత రాజానగరం, కలవచర్ల, దివాన్ చెరువు గ్రామంలో కొనసాగింది. దీనిలో వైకాపా అభ్యర్థి జక్కంపూడి రాజా రాజానగరం సమీపంలో సూర్యారావు పేట 194 పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. జనసేన అభ్యర్థి బత్తుల బలరామకష్ణ కోరుకొండ మండలం గాదారాడలో ఓటు వేశారు. **చాగల్లు:** చాగల్లు మండలంలో 13 గ్రామాల్లో 50 పోలింగ్ బూతుల్లో ఉదయం 7 గంటల నుండి జనం బారులు తీరారు. చాగల్లు 118 బూత్‌లో ఇవిఎం ఇబ్బంది పెట్టడంతో సుమారు 45 నిమిషాల వరకు ఓటర్స్ ఇబ్బంది పడ్డారు. స్థానిక పంచాయతీ ఎన్నికల కన్నా జనరల్ ఎన్నికలకు ఇతర దేశాలు ఇతర రాష్ట్రాలు నుంచి ఈ ఎన్నికల్లో ఓటు వేయడం స్థానికులు చర్చించుకుంటున్నారు. మండలంలో మార్కొండపాడు, బ్రాహ్మణగూడెం, కలవలపల్లి, చిక్కాల గ్రామాల్లో సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించి సెంట్రల్ పోస్ట్ నుండి నలుగురు చొప్పున ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు. చాగల్లు మండలంలో ఉదయం 9 గంటలకు 10.49 శాతం, 11 గంటలకు 24.62 మధ్యాహ్నం ఒంటిగంటకు 40.77 శాతం మూడు గంటలకు 55.89 శాతం ఓటింగ్ జరిగినట్లు తహశీల్దార్ ఎం.సావిత్రి తెలిపారు. సాయంత్రం 6 గంటల వరకు ఓటర్లు ఎన్నికలు పాల్గొనొచ్చని తహశీల్దార్ తెలిపారు. **ఉండ్రాజవరం:** సార్వత్రిక ఎన్నికలలో చివరి ఘట్టం పోలింగ్, ఓటింగ్ సోమవారం మండలంలో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 5.30 గంటలకు అధికారుల నమూనా ఓటింగ్ అనంతరం ఏడు గంటలకు ఓటింగ్ ప్రారంభమైంది. అనేకచోట్ల 6 గంటల నుండే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు ఉత్సాహంగా బారులు తీరారు. అయితే కొన్నిచోట్ల ఇవిఎంలు మొరాయించడంతో ఉదయం పూట ఓటింగ్ నెమ్మదిగా సాగింది. ప్రభుత్వం షామియానాలు, మంచినీళ్ళు ఏర్పాటు చేయడంతో ఓటర్లు లైనుల్లోఉండి, తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసే సమయం సాయంత్రం ఆరు గంటల వరకు నియోజకవర్గంలో 70 నుండి80 శాతం పోలింగ్ జరిగింది. పోలింగ్ సమయం ముగిసిన అనంతరం క్యూ లైన్ లో వేచి ఉన్న ఓటర్లను లోనికి అనుమతించి గేట్లు మూసివేశారు. మొత్తం మీద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రాణ నష్టం లేకుండా, చిన్నపాటి ఘర్షణలతో పోలింగ్ ముగిసింది. **నల్లజర్ల:** మండలంలో 24 గ్రామాల్లో చిన్న చిన్న సంఘటనలు మినహా సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కూటమి బలపరిచిన గోపాలపురం తెలుగుదేశం అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు. తన ఓటును ప్రకాష్ రావు పాలెం హై స్కూల్ నందు వినియోగించుకున్నారు. మండలంలోని, 24 గ్రామాల్లో 66 పోలింగ్ కేంద్రాలు ఉండగా. రాత్రి 9:30 గంటల వరకు పోలైన ఓట్లు 79 శాతం, ఉందని అధికారులు తెలిపారు.

ఉండ్రాజవరంలో క్యూ లైన్ లో వేచి ఉన్న మహిళా ఓటరు

నల్లజర్ల జెడ్‌పి హైస్కూల్లో బారులు తీరిన ఓటర్లు

వెలగదుర్రులో తండ్రితో కలిసి ఓటు వేసిన యువతి

పోలింగ్‌కు పోటెత్తారు

ప్రజాశక్తి-యంత్రాంగం

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం పోలింగ్ జరిగింది. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, తదితరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. **రాజానగరం:** రాజానగరం మండలం సూర్యారావుపేట 194 పోలింగ్ కేంద్రలో రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి జక్కంపూడి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అందరూ వినియోగించుకోవాలని కోరారు. కూటమి పార్టీ నాయకులు గుమిగూడి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నా వైసిపి నాయకులు ప్రశాంతంగా ఉండాలని జక్కంపూడి రాజా అన్నారు. దీనిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కూటమి నాయకులు గుమిగూడి అల్లర్లు సష్టించడానికి చూస్తున్నారన్నారు. దీనిపై ఎన్నికల అధికారులకు చెప్పడం జరిగిందని తెలిపారు **ఉండ్రాజవరం:** రాష్ట్రం త్వరితంగా అభివద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అదే యువతకు ప్రాధాన్యమని మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకున్న పి.ఉషా గాయత్రి చెప్పింది. విశాఖపట్నంలో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్న మండలంలోని వెలగదుర్రు గ్రామానికి చెందిన గాయత్రి ప్రత్యేకంగా ఓటు వేసేందుకు వచ్చినట్లు తెలిపింది. మొదటిసారి ఓటు వేయడం థ్రిల్లింగ్ ఎక్స్పీరియన్స్ ఇచ్చిందంటోంది. మండలంలో మొత్తం 1886 మంది 18 ప్లస్ వోటర్ లు సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకోవలసి ఉంది.

మత్స్యకార గ్రామాల్లో కొనసాగిన పోలింగ్

ప్రజాశక్తి -కాట్రేనికోన

సార్వత్రిక ఎన్నికలలో మత్స్యకార గ్రామాలలో సమయం రాత్రి పదిగంటల తరువాత కూడా పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. పోలింగ్ సమయం ఆరు గంటలకు పూర్తి కావలిసి ఉండగా, కాట్రేనికోన మండలం మత్సకార గ్రామాలలో పల్లం, బలుసుతిప్ప గ్రామాలలో, క్యూ లైన్లలో నిలబడి ఓట్లు వేసేందుకు ఓటర్లు ఎదురుచూసారు. అయా గ్రామాలలో పొలింగ్ ప్రక్రియ మందకొడిగా సాగడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

ఆలస్యంగా పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు తెలిపారు.

ఆలస్యంగా పోలింగ్

సామర్లకోట మున్సిపాలిటీ బ్రౌన్ పేట 132 పిఎస్‌లో ఎంపీ అభ్యర్థి ఇవిఎం సెట్టింగ్‌లో ఇబ్బంది ఏర్పడటంతో 15 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. కాకినాడ రూరల్ తూరంగి 184 పోలింగ్ స్టేషన్‌లో ఇవిఎం మొరాయించడంతో అరగంట వరకూ పోలింగ్ మొదలు కాలేదు. కొత్తపేట నియోజకవర్గం ఆత్రేయపురం మండలం లొల్ల జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో 37వ పోలింగ్ బూత్‌లో అసెంబ్లీ నియోజకవర్గం ఇవిఎం సాంకేతిక లోపంతో మొరాయించడంతో కొంత సేపు ఓటింగ్ ప్రక్రియ నిలిచింది. అనంతరం టెక్నీషియన్ రావడంతో సమస్య పరిష్కారం అయ్యింది. సామర్లకోట పట్టణ పరిధి బొడ్డు భాస్కర రామారావు పాఠశాల 160 నెంబర్ పోలింగ్ బూత్‌లో ఇవిఎం మొరాయించడంతో 40 నిముషాల పాటు పోలింగ్ నిలిచింది. దీంతో ఓటర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మండపేట మండలం ఏడిద సీతానగరంలో ఓటింగ్ మిషన్‌లు మొరాయించాయి. దీంతో పోలింగ్‌లో జాప్యం జరిగింది. కరప మండలం అరట్లకట్టలో 210 పోలింగ్ స్టేషన్లో ఇవిఎం మొరాయించడంతో ఓటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తాగునీటి సదుపాయం కూడా లేని కాకినాడ స్మార్ట్ సిటీలో గాంధీనగర్ మున్సిపల్ స్కూల్లో 57వ పోలింగ్ బూత్‌లో సౌకర్యాలు లేక ఓటర్లు కొంతసేపు ఆందోళన చేసారు.

బారులు తీరిన ఓటర్లు

ఎండాకాలం కావడంతో ఉదయం 6 నుంచే పలు కేంద్రాలకు ఓటర్లు చేరుకున్నారు. ఓటు వేసే ప్రక్రియ ఆలస్యం కావడంతో మెజారిటీ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరడం కనిపించింది. మరోవైపు ఓటు హక్కు వినియోగించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి సైతం స్వగ్రామాలకు ఓటర్లు తరలివచ్చారు. ఓటు హక్కుపై అవగాహన బాగా పెరగడంతో ఓటింగ్ శాతం కూడా ఈసారి గణనీయంగా పెరిగింది. సాయంత్రం 6 గంటల వరకు సమయం ఉండడంతో ఎన్నికల అధికారులు క్యూ లైన్లలో నిలుచున్న ఓటర్లకు ఓటు వేసుకునే అవకాశం కల్పించారు. దీంతో రాత్రి 9 గంటల వరకు కూడా కొన్ని కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. కాకినాడ దుమ్ములపేట, రేచర్లపేట 42, 48, 49, 50, 51 పోలింగ్ బూత్‌లలో పెద్ద సంఖ్యలో ఓటర్లు బారులు తీరారు.

ముఖ్య నేతలు ఓటు హక్కు

కాకినాడ జిల్లా కిర్లంపూడిలో మాజీ మంత్రి, వైసిపి నేత ముద్రగడ పద్మనాభం కుటుంబ సమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాకినాడలో మాజీ కేంద్ర సహాయ మంత్రి, కాంగ్రెస్ పార్టీ కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి ఎంఎం పళ్లంరాజు ఓటు వేశారు. కుటుంబ సభ్యులతో కలిసి కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ఓటు వేశారు. కాకినాడ ఘాటీ సెంటర్ వద్ద ఉన్న 208 పోలింగ్ బూత్ వద్ద టిడిపి కాకినాడ సిటీ అభ్యర్థి వనమాడి కొండబాబు ఓటు వేసారు. జనసేన పార్టీ కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్ పిఠాపురం కుమ్మరివీధిలో ఉన్న 2వ సచివాలయంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాకినాడ సిటీ నియోజకవర్గంలోని నగరపాలక సంస్థ బాలికల ఉన్నత పాఠశాల శ్రీనగర్ 23వ పోలింగ్ బూత్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

చెదురు మొదురు ఘటనలు

కాకినాడ సిటీ ఆనందభారతి రామకృష్ణారావుపేట వద్ద వైసిపి, టిడిపి కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. వైసిపి మాజీ కార్పొరేటర్ సత్యకు గాయాలైనట్లు నాయకులు తెలిపారు. రామకృష్ణారావుపేటలో ఇరు పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తల మధ్య జరిగిన వివాదం కాస్తా గొడవకు దారి తీసినట్లు తెలుస్తోంది. పిఠాపురంలో స్థానిక ఆర్ఆర్ బి హెచ్ఆర్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో జనసేన కార్యకర్త కండువా వేసుకుని ప్రచారం చేస్తుండగా అదే సమయంలో అక్కడికి చేరుకున్న వైసిపి అభ్యర్థి వంగా గీత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యథేచ్ఛగా ఎన్నికల నిబంధనలను పక్కనపెట్టి జనసేన కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారని ఆమె ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. కిర్లంపూడి మండలం పాత కృష్ణవరం పోలింగ్ బూత్ వద్ద రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో వివాదం రేగింది. పోలింగ్ కోసం ఏర్పాటు చేసిన టెంట్లు పీకివేశారు. కొన్ని కుర్చీలు విరగగా, రెండు వర్గాల్లో కొంతమందికి స్వల్పంగా గాయాలు అయ్యాయి. అనంతరం పోలీసులు వచ్చి వారిని చెదరగొట్టారు. ఇవిఎంలు చీకట్లో ఉన్నాయంటూ పిఠాపురం జగ్గయ్య చెరువు బాదం మాధవరావు పాఠశాల పోలింగ్ బూత్ వద్ద ప్లకార్డులతో కొంతమంది నిరసన తెలిపారు. కాకినాడ సిటీ 6వ డివిజన్లో ఓటు వేయడానికి వచ్చిన వృద్ధురాలు మతి చెందింది. యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ హైస్కూల్లోకి మాజీ ఎంఎల్ఎ వర్మ రావడంతో స్థానిక మత్స్యకారులు వ్యతిరేకించారు. కాకినాడ దుమ్ములపేటలో ఓట్ల కోసం తొక్కిసలాటలో వద్ధురాలు అస్వస్థతకు గురైంది.

ప్రజాశక్తి 3
మంగళవారం 14 మే 2024

కాకినాడ రూరల్‌లో ముగిసిన పోలింగ్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్, కరప

కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని కాకినాడ రూరల్, కరప మండలాల్లో చెదురుమదురు సంఘటనలు మినహా ఎన్నికల ప్రశాంతంగా ముగిసాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 41 గ్రామాల్లో 264 పోలింగ్ కేంద్రాల్లో 2లక్షల 69 వేల 330 ఓటర్లు ఉండగా పోలింగ్ సమయం ముగిసేసరికి ప్రస్తుతం అధికారుల లెక్కల ప్రకారం 1లక్ష 82 వేల 176 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నానికి నెమ్మదిగా పెరుగుతూ వచ్చింది. ఓటర్లు పోల్ చీటీలతోపాటు గుర్తింపు కార్డులను వెంట తెచ్చుకుని ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రం వద్ద బారులు దీరారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. నడవలేని వారిని, వయోవృద్ధులను కొందరు ప్రత్యేకంగా వీల్ చైర్లలో పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చి ఓటు వేయించి తీసుకువెళ్ళారు. ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఈసారి అధికారులు సుందరంగా తీర్చిదిద్దారు. ఆదర్శ పోలింగ్ కేంద్రాలు, మహిళా పోలింగ్ కేంద్రాలను ప్రత్యేక అలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. తాగునీటి వసతితోపాటు నీడ కోసం షామియానాలను ఏర్పాటు చేశారు. ఓటర్ల కోసం కొన్ని కేంద్రాల్లో కార్పెట్ కూడా పరిచి ఉంచారు. 6 గంటల తర్వాత కూడా లైన్‌లలో ఉన్న ఓటర్లను ఓటు వినియోగించుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. కరప మండలంలోని అరట్లకట్ట, నడకుదురు, కాకినాడ రూరల్ లోని కొన్నిచోట్ల ఇవిఎంలు మొరాయించటంతో ఓటర్లు క్యూ లైన్‌లలో ఉన్నారు. సాయంత్రం 6 గంటలకు నియోజకవర్గ వ్యాప్తంగా 67. 64 శాతం ఓట్లు నమోదు అయినట్లు ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని ఎన్నికల అధికారి ఇట్ల కిషోర్ తెలిపారు. కాకినాడ రూరల్ మండలంలో వాకలపూడి పోలింగ్ కేంద్రాలు 30,31 భారీగా క్యూలైన్లో జనం ఉండడంతో అధికారులు నెంబర్లను పంపిణీ చేశారు. రూరల్ మండలం సూర్యారావుపేట పంచాయతీ, హైస్కూల్ వద్ద ఆరుగంటల తర్వాత లోపల బారులు తీరిన ఓటర్లుకు సమయం సుమారు రాత్రి 11 గంటలు సమయంలో పూర్తి కావచ్చని అధికారులు తెలిపారు.

ఓటర్లు కిక్కిరిసిపోయిన హై స్కూల్ ప్రాంగణం

చంటి పిల్లలతో ఓటింగ్‌కు హాజరైన మహిళలు

కనిపించని బూత్ నెంబర్ - ఓటర్ల ఇక్కట్లు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక బ్రౌన్ పేట 132 పోలింగ్ కేంద్రం వద్ద పిఎస్ నెంబర్ పెయింటింగ్ వేయకపోవడంతో సోమవారం ఉదయం ఓటు వేయడానికి ఓటర్లు అయోమయానికి గురయ్యారు. ఇదే పోలింగ్ బూత్‌లో ఎంపీ అభ్యర్థి ఇవిఎం సెట్టింగ్‌లో ఇబ్బంది తలెత్తడంతో 15 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభం అయ్యింది.

బూత్ నెంబర్ లేకుండా బోర్డు

సౌకర్యాల లేమితో వెనుదిరిగిన ఓటర్లు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు విచ్చేసిన ఓటర్లకు అధికారులు సరైన రీతిలో సదుపాయాలు కల్పించకపోవడంతో ఓటు వేసేందుకు నిరాకరిస్తూ వెనుదిరిగారు. పట్టణంలోని బలుసుల పేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన 152, 157 పోలింగ్ కేంద్రాల వద్దకు ఉదయం 8 గంటలకే వందల సంఖ్యలో ఓటర్లు రావడంతో పాఠశాల ప్రాంగణం నుంచి రోడ్ పైకి వారు బారులు తీరి నిలబడి ఎండల తాపానికి వివరంగా ఇబ్బంది పడ్డారు. అవసరమైంత మేరకు టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో పలువురు ఓటర్లు ఎండల తాపానికి తాళలేక ఓటు హక్కును వినియోగించు కోకుండా వెనుదిరిగారు. ఇంకా అనేక ప్రాంతాల్లో ఏర్పాట్లు కొరత కారణంగా ఓటర్లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటూ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికారుల తీరుపై ఎంఎల్ఎ చినరాజప్ప అసంతృప్తిని వ్యక్తం చేశారు.

తునిలో ముగిసిన ఎన్నికలు

బూత్ పరిశీలనకు వస్తున్న టిడిపి అభ్యర్థి దివ్య, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు

ప్రజాశక్తి - కోటనందూరు

తుని నియోజకవర్గంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. కోటనందూరు, తుని, తొండంగి మండలాల పరిధిలో2,24,538 మంది ఓటర్లు ఉండగా 223 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 6 గంటల నుంచి ఓటర్లు ఓటు వేయడం కోసం బారులు తీశారు. కొన్ని చోట్ల ఇవిఎం మోరాయించడంతో ఓటింగ్ ఆలస్యంగా జరిగింది. వైసిపి అభ్యర్థి మంత్రి దాడిశెట్టి రాజా తన కుటుంబ సభ్యులతో తమ స్వగ్రామమైన ఎస్.అన్నవరం గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. టిడిపి అభ్యర్థి యనమల దివ్య, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు కుటుంబ సభ్యులతో కలిపి తమ స్వగ్రామమైన ఎవి నగరం గ్రామంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హంస వరము, అల్లిపూడి, ఇందుకపల్లి గ్రామాల్లో వైసిపి, టిడిపి కార్యకర్తల మధ్య వివాదం రాయడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి సముదాయించారు. మంత్రి రాజా తుని పట్టణంలో జరుగుతున్న పోలింగ్ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి జెండా రెపరెపలాడుతుందన్నారు. రాత్రి 9 గంటల వరకు అల్లిపూడి, ఇందుకుపల్లి, హంసవరం గ్రామాల్లో పోలింగ్ కొనసాగుతుంది. నియోజకవర్గంలో 68.09 శాతం పోలింగ్ నమోదు అయ్యిందనిఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు.

వృద్ధుడిని వీల్‌చైర్‌పై బూత్‌కు తీసుకొచ్చిన కుటుంబికులు

ప్రత్తిపాడులో ఎన్నికలు ప్రశాంతం

ఏలేశ్వరంలో క్యూకట్టిన ఓటర్లు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం, ప్రత్తిపాడు, రౌతులపూడి శంకవరం మండలాల్లో చెదురుమదురు సంఘటనలు మినహా ఎన్నికల ప్రశాంతంగా ముగిసాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 79 గ్రామాల్లో 227 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎన్నికలు ప్రక్రియ కొనసాగగా 6 గంటల తర్వాత కూడా లైన్‌లలో ఉన్న వాటర్‌లను ఓటు వినియోగించుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. దీంతో పలు పోలింగ్ స్టేషన్లో ఓటర్లు క్యూలైన్‌లలో ఉన్నారు. సాయంత్రం 6 గంటలకు నియోజకవర్గ వ్యాప్తంగా 67. 68 శాతం ఓట్లు నమోదు అయినట్లు ఎన్నికల అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. కొన్ని పోలింగ్ స్టేషన్లో వెలుగు సక్రమంగా లేకపోవడం, ఇవిఎంలలో స్వల్ప మరమ్మతులు రావడం తప్ప ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందన్నారు. పలు పోలింగ్ స్టేషన్లకు ఓటర్లు ఉదయం 6 గంటలకు చేరుకుని తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూ కట్టారు. ఇవిఎంలు మొరాయించడంతో ఆలస్యంగా పోలింగ్ ప్రారంభం అయ్యింది.

ప్రత్తిపాడులో సాయంత్రం వేళ క్యూలో ఉన్న ఓటర్లు

క్రైం వార్తలు

ఆత్మహత్యకు పాల్పడిన గుర్తు తెలియని యువకుడు

ఆత్మహత్యకు పాల్పడిన గుర్తుతెలియని వ్యక్తి

ప్రజాశక్తి - యానాం

స్థానిక జెండా స్తంభం వద్ద ఉన్న మార్కెట్ కాంప్లెక్స్‌లో గుర్తు తెలియని వ్యక్తి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...మృతి చెందిన వ్యక్తికి 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటాయని సోమవారం మధ్యాహ్నం నాలుగు గంటల సమయంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలు తెలిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

12 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లి గ్రామంలో సోమవారం ఎస్ఇబి అధికారులు చేసిన దాడిలో 12 మద్యం సీసాలతో ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు . ఈ దాడులలో సిఐ కెవి.స్వామి, ఎస్ఐ పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరంలో వైసిపికే పట్టం

-గెలుపుపై అర్బన్ ఎంఎల్ఎ అభ్యర్థి భరత్ జోస్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గంలో ఓటర్లు వైసిపికే పట్టం కట్టబోతున్నారని వైసిపి అర్బన్ నియోజకవర్గ అభ్యర్థి మార్గాని భరత్ రామ్ జోస్యం చెప్పారు. నగరంలోని విఎల్ పురం చేపల మార్కెట్ పక్కన సచివాలయంలో బూత్ నెం 160లో ఓటు హక్కును వినియోగించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. నగరంలో ప్రతీ బూత్ వద్దకు ఉదయం 6 గంటల నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు తరలిరావడం చూస్తుంటే నగరంలో నేను చేసిన అభివృద్ధిని చూసి ఎంఎల్ఏగా నన్ను గెలిపించేందుకు ఒక దృఢమైన నిర్ణయంతో వచ్చారన్నారు. కూటమిపై ప్రజలకెవరికీ నమ్మకం లేదన్నారు. ఎందుకంటే 2014లో ఇదే కూటమితో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ప్రజలకు, రాష్ట్రానికీ చేసిందేమీ లేదన్నారు. చంద్రబాబు అప్పుడు ఏకంగా 640 హామీలిచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ప్రజలు 2019లో తగిన గుణపాఠం చెప్పారన్నారు. మళ్ళా ఇప్పుడు అదే కూటమి 'అది చేస్తాం ఇది చేస్తాం' అని శుష్క వాగ్దానాలిచ్చేస్తే నమ్మడానికి ప్రజలేమీ అమాయకులు కాదన్నారు. జగన్మోహన్ రెడ్డి అంటే ఒక నమ్మకం, ఒక భరోసా, ఒక నిజమని చెప్పారు. ఈ అయిదు సంవత్సరాలలో జగనన్న చెప్పిందానికన్నా ఎక్కువే చేసి ప్రజాభిమానం చూరగొన్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలంతా సంక్షేమ రాజ్యం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం మళ్ళా జగనన్నను సీఎం చేయడానికి పట్టం కట్టబోతున్నారని అన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం ఇచ్చే వెయ్యి రూపాయల పెన్షన్ కోసం అవ్వాతాతలు, దివ్యాంగులు ఎన్ని కష్టాలు పడేవారో అందరికీ తెలుసన్నారు. రాష్ట్రంలో 66 లక్షల మందికి పెన్షన్లు వైసిపి ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ప్రతిపక్షాలు ఊహాలోకంలో విహరిస్తున్నాయని, 2019 ఎన్నికల నాటి తీర్పు మరోసారి రానుందని తెలిపారు.

ఉద్రిక్తతల నడుమ పిఠాపురంలో పోలింగ్

- ఓట్లు తొలగించారని ఓటర్ల ఆందోళన
-వైసిపి, జనసేన కార్యకర్తల మధ్య తోపులాట

పి వేమవరంలో తోపులాటకు దిగిన ఇరువర్గాలు

ప్రజాశక్తి - పిఠాపురం, యు.కొత్తపల్లి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో పోలింగ్ ఉద్రిక్తల నడుమ ప్రశాంతంగా సాగింది. ఉదయం నుంచి ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించేందుకు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూ లైన్‌లో వేచి ఉన్నారు. పోలింగ్ మందకొడిగా సాగడంతో ఓటర్లు మండుటెండలో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఎదురయింది. పలు కేంద్రాల వద్ద మంచినీరు టెంట్లు ఏర్పాటు చేసిన అవి సరిపోకపోవడంతో ఓటర్లు ఇబ్బందులకు గురయ్యారు. ఓటు వేసేందుకు అధిక సమయం పట్టడంతో ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. పోలింగ్ సమయం ముగిసిన పలు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ కొనసాగుతూనే ఉంది.

మండలంలోని విరవాడ గ్రామంలో జనసేన, వైసిపి, కార్యకర్తలు పోలింగ్ కేంద్రం వద్ద కవ్వింపు చర్యలకు పాల్పడారు. వైసిపి కార్యకర్తలు కండువాలు కప్పుకుని పోలింగ్ కేంద్రం సమీపంలో ప్రచారం చేస్తున్నారంటూ జనసేన నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య వాదోపవాదాలు తోపులాటకు దారి తీశాయి. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టారు. మండలంలో విరవ గ్రామంలో పోలింగ్ కేంద్రంలోకి వైసిపి అభ్యర్థి వంగా గీత వెళ్ళడానికి విలులేదంటూ జనసేన కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడ చేరుకున్న పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పిఠాపురం మండలంలోని కుమారపురం గ్రామంలో వైసిపి నాయకులు దౌర్జన్యంగా తమ యొక్క ఓటు వేసే స్లిప్పులను పట్టుకుని పోయి, సంతకాలు పెట్టించుకున్నారని, వారు ఎక్కడ పోయారో తెలియట్లేదని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. విరవ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌లో జనసేన పార్టీకి చెందిన 281 ఓట్లు తొలగించారని పార్టీ కార్యకర్తలు, ఓటర్లు అధికారులను నిలదీశారు. దీంతో అక్కడ చేరుకున్న తహశీల్దార్ కె లక్ష్మి, డిఎస్‌పి కె.హనుమంతరావు వారితో చర్చించారు. ఓట్లు తొలగింపు దానిమీద సమగ్ర విచారణ చేపడతామని ఒకవేళ ఓట్లు తొలగించిన మాట వాస్తవం అయితే సంబంధిత అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. గొల్లప్రోలు పట్టణంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద వైసిపి చెందిన కొంత మంది మహిళలు, కార్యకర్తలు జండాలతో ప్రచారం చేయడంతో ప్రచారాన్ని కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అక్కడ చేరుకున్న పోలీసులు ఇరువురిని చెదరగొట్టారు. యు.కొత్తపల్లి మండలంలో ప్రశాంతంగా ఓట్లు ప్రక్రియ జరిగింది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా కొన్ని గ్రామాలు తప్ప అన్ని గ్రామాలలో ఓటర్లు ఓట్లు వినియోగించుకున్నారు. నాగులపల్లి, ఉప్పాడ మినహా అన్ని గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణంలో ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నాగులపల్లిలో వైసిపి రాష్ట్ర నాయకులు వడిశెట్టి నారాయణరెడ్డి, టిడిపి, జనసేన నాయకులు మధ్య కొద్దిపాటి వాగ్వివాదం చోటుచేసుకుంది. అలాగే ఉప్పాడ జడ్‌పి హైస్కూల్‌లో మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ రావడంతో వైసిపి, టిడిపి నాయకులు మధ్య చిన్నపాటి గొడవలు చోటు చేసుకున్నాయి. మండలంలో ప్రశాంతమైన ఓటింగ్ అధికారులు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి పోలింగ్ సెంటర్లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. ప్రతి బూతులో కొత్తపల్లి ఎస్‌ఐ స్వామినాయుడు పర్యవే క్షించి చర్యలు తీసుకున్నారు. ఓటు వేసేందుకు ప్రతి ఒక్కరు ఆసక్తి చూపడంతో ఎండలు సైతం లెక్కచేయకుండా ఓటు వేసేందుకు లైన్‌లో ఓటర్లు క్యూలు కట్టారు. ఎన్నడులేని విధంగా ఈసారి ఎన్నికలకు ఓటింగ్ శాతం పెరిగిందని అధికారులు తెలుపుతున్నారు. తీర ప్రాంత గ్రామాల్లో అయితే వేకువ జాము నుంచి ఓటింగ్ వేసేందుకు అధిక స్థాయిలో మత్స్యకారులు క్యూ కట్టారు.

జగ్గంపేటలో ముగిసిన పోలింగ్

జగ్గంపేటలో పోలింగ్ బూత్ వద్ద క్యూ కట్టిన ఓటర్లు

ప్రజాశక్తి - జగ్గంపేట, గండేపల్లి, గోకవరం, కిర్లంపూడి

నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. నియోజకవర్గ వ్యాప్తం గా 248 పోలింగ్ బూత్‌లలో ఈ ఎన్నికలు నిర్వహించారు. అయితే మండలంలోని ఇర్రిపాక గ్రామంలో టిడిపి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ తన ఓటు హక్కు ను వినియోగించుకున్నారు. అదే విధంగా ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు ఇర్రిపాకలో, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మరోతి శివగణేష్ లు తమ ఓటు హక్కు ను వినియోగించుకున్నారు. కిర్లంపూడి మండలం వీరవరం గ్రామంలో వైసిపి అభ్యర్థి తోట నరసింహం తన కుటుంబ సభ్యులతో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలు గ్రామాల్లో చిన్న చిన్న సంఘటనలు జరిగినా అధికార యంత్రాంగం చొరవ తీసుకుని బూత్‌ల వద్ద ఎటువంటి ఘర్షణలకు తావు లేకుండా చర్యలు తీసుకున్నారు. కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామంలో పాత కృష్ణవరం పోలింగ్ బూత్ వద్ద టిడిపి, వైసిపి కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో రెండు వర్గాల వారికి గాయాలయ్యాయి. పోలింగ్ సమీపంలో ఎదురెదురుగా రెండు పార్టీల కార్యకర్తలు టెంట్లు వేసుకుని ఓటరు స్లిప్పులు అందిస్తున్న క్రమంలో ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరిపై మరొకరు రాళ్ళతోనూ, కర్రలతోను దాడి చేసుకోవడంతో వైసిపికి చెందిన ఇద్దరి తలలకు గాయాలయ్యాయి. అలాగే టిడిపికి చెందిన ఒకరికి కనురెప్ప పైన, మరొకరికి చాతి పైన గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రెండు వర్గాల వారిని చెదరగొట్టారు. పోలీసు బలగాలు భారీగా మోహరించారు. అలాగే గోకవరం మండలంలో మొత్తం 64 పోలింగ్ బూత్ లలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అక్కడక్కడ ఇవిఎంలు ఆలస్యంగా పని చేయడం వల్ల ప్రజలు బారులు తీరారు. గండేపల్లి మండలంలో గండేపల్లి మురారి మల్లేపల్లి గ్రామాల్లో పోలింగ్ బూత్లను వద్ద ఓటర్లు బారులు తీరారు. మొత్తం సాయంత్రం 6 గంటలకి 70.98 శాతం ఓట్లు నమోదు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. అదే విధంగా గండేపల్లి మండలం నీలాద్రిరావు పేట గ్రామంలో రాత్రి 7 అయిన సరే ఓట్లు వేసేందుకు పోలింగ్ బూత్ ల వద్ద క్యూ లైన్లు కట్టారు. అందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేశారు.

పెద్దాపురంలో పోలింగ్ ప్రశాంతం

పోలింగ్ బూత్ వద్ద క్యూ కట్టిన జనం

ప్రజాశక్తి - సామర్లకోట, పెద్దాపురం

పెద్దాపురం నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం మంద కోడిగా సాగింది. నియోజకవర్గ పరిధిలో 67 పోలింగ్ బూత్‌లో రాత్రి 9:00 వరకు పోలింగ్ జరిగిందంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మార్క్ పోలింగ్ అనంతరం ఉద యం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. అయితే చాలా కేంద్రాల్లో ఇవిఎంలు మొరాయిం చడంతో సుమారు 45 నిమిషాల నుంచి గంటపాటు ఆలస్యంగా పోలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. మండే ఎండలకు భయపడి ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద భారీ సంఖ్యలో బారులు తీరారు. సరైన తాగునీరు, పూర్తిస్థాయిలో టెంట్లు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమవడంతో గంటలు తరబడి ఎండలోనే వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. చెదురుమదురు సంఘటన మినహా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. సామర్లకోట పట్టణంలోని సుమారు 16 పోలింగ్ కేంద్రాల వద్ద రాత్రి 9 గంటల వరకూ పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. నియోజక వర్గ పరిధిలో 201 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరగగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఓటర్లు స్వచందంగా అధిక సంఖ్యలో తరలి వచ్చి వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటింగ్ ఆలస్యంతో ఇబ్బందులు

ఇవిఎంల ద్వారా ఓటుహక్కు వినియోగించుకునే ప్రక్రియలో ఓటుకు, ఓటుకు మధ్య 30 సెకెన్ల సమయం తీసుకుంది. అలాగే ఇవిఎం ప్యాడ్‌పై ఇచ్చిన అభ్యర్థుల గుర్తులను గుర్తించే విషయంలో వృద్ధులు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో ఓటింగ్ ప్రక్రియ మంద కొడిగా సాగింది. నియోజక వర్గ పరిధిలో ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటలకు జరిగిన పోలింగ్ శాతం 50.67 శాతం మాత్రమే జరిగింది. నియోజవర్గ పరిధిలో ఓటింగ్ జరుగుతున్న తీరును కూటమి అభ్యర్థి, టిడిపి ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, వైసిపి అభ్యర్థి దవులూరి దొరబాబు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుమ్మల బాబు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, పలువురు స్వతంత్ర అభ్యర్థులు వారి వారి అనుచరులతో వచ్చి పర్యవేక్షించారు. ఎంఎల్‌ఎ చినరాజప్ప తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును సామర్లకోట మండలం అచ్చంపేట 195వ బూతులో ఓటు హక్కు వినియోగించుకున్నారు. వైసిపి అభ్యర్థి దవులూరి దొరబాబు పెద్దాపురం మండలం తాటిపర్తిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. సామర్లకోట మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, మున్సిపల్ హైస్కూల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

చెదురు మధురు ఘటనలు

సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన వేట్లపాలెం, పి వేమవరంలో చెదురు మాదురు ఘటనలు జరిగాయి. స్పెషల్ ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పి వేమవరంలో వైసిపి అభ్యర్థి దొరబాబుతోపాటు అనుచరులు పోలింగ్ బూత్ లోకి వెళ్లడానికి ప్రయత్నించడాన్ని టిడిపి నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరు వర్గాలకు తోపులాట జరిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇది వర్గాలను అదుపులోకి తెచ్చారు. పోలింగ్ కేంద్రాల భద్రతా ఏర్పాట్లను పెద్దాపురం డిఎస్‌పి లతా కుమారి ఆధ్వర్యంలో పర్యవేక్షించారు.

ఆలస్యం కావడంతో మెట్లపై కూర్చున్న ఓటర్లు

ఇవిఎంల మొరాయింపుతో ఆలస్యం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలో నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 5:30కే మాక్ పోలింగ్ నిర్వహించిన అధికారులు అనంతరం పోలింగ్ ప్రారంభించారు. మాక్ పోలింగ్‌తోపాటు సాధారణ పోలింగ్‌లో పలుచోట్ల ఇవిఎంలు మొరాయించటంతో పోలింగ్ ఆలస్యమైంది. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఉదయం 7 గంటల నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అరకొర సౌకర్యాలు కల్పించడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలింగ్ సమయం ముగిసినా సాయంత్రం 6 గంటల తరువాత తాళ్లరేవు హైస్కూల్, మాధవరాయునిపేట, సీతారామపురం, గాడిమొగ, పెదవలసల, చినవలసల పోలింగ్ కేంద్రాలలో ఓటర్ల తమ ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్నారు. తాళ్లరేవు హైస్కూల్‌లోని 223, 224 పోలింగ్ కేంద్రాలలో ఇవిఎంలు తరచూ మొరాయించడంతో పోలింగ్ రాత్రి 9 గంటల వరకూ కొనసాగింది. మండలంలో మత్స్యకార గ్రామాల్లో సుమారు 90 శాతం పోలింగ్ నమోదయ్యింది. మండల వ్యాప్తంగా సుమారు 80 శాతం పోలింగ్ జరిగింది. అక్కడ అక్కడ చెదురు మదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

కాజులూరులో పోలింగ్ బూత్ వద్ద క్యూ కట్టిన ఓటర్లు

మండలంలో బారులు తీరిన ఓటర్లు

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని పోలింగ్ ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ స్టేషన్ వద్ద ఓటర్లు బారులు తీరారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాజకీయ పార్టీలు సుదూర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు, వాహనాలతో ఓటర్లు ను పోలింగ్ కేంద్రాల వద్దకు తీసుకురాగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సైతం స్వల్ప సంఘటన మినహా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐలు రవికుమార్, రామచంద్రమూర్తి ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవడంతో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. మండల కేంద్రమైన కాజులూరులో వైసిపి వర్గాలు నగదు పంపిణీ చేస్తున్నట్లు వచ్చిన వదంతులతోఉద్రిక్త పరిస్థితి నెలకుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించడంతోపాటు యువత ఆసక్తి చూపడంతో అధిక శాతం నమోదయింది. మండలంలోని శలపాక, గొల్లపాలెం, ఆర్యవట్టం, పల్లిపాలెం, కాజులూరు, కోలంక గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడినప్పటికీ పోలీసులు సంయమనంతో వ్యవహరిం చడంతో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ సాగింది. సాయంత్రం 6 దాటినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ జరుగుతుండడంతో రాత్రి 9 గంటలకు కొనసాగింది. కాజులూరులో 83 శాతం పోలింగ్ నమోదైంది.

ఎన్నికల ఏర్పాట్లలో అధికారుల విఫలం

ప్రజాశక్తి - సామర్లకోట

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో పోలింగ్ బూత్‌ల్లో ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారని టిడిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప ఆరోపించారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియను టిడిపి అభ్యర్థి, సిట్టింగ్ ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప పరిశీలించారు. ఈ సందర్భంగా రాజప్ప మాట్లాడుతూ ఉదయం 7 గంటల నుంచి ఓటు హక్కును వినియోగించుకునేందుకు తండోపతండాలుగా తరలివస్తున్నట్టు చెప్పారు. అయితే ఎండల కారణంగా ఇబ్బంది పడుతుండగా అధికారులు ఏర్పాట్ల విషయంలో విఫలమయ్యారన్నారు.

ముగిసిన పోలింగ్

ప్రజాశక్తి-యంత్రాంగం

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా డాక్టర్ బిఆర్. ంబేద్కర్ కోనసీమ జిల్లాలో సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఎన్నికల అధికారులు తెలిపారు. **అమలాపురం:** జిల్లా వ్యాప్తం గా ప్రశాంత వాతావరణంలో సజావుగా పోలింగ్ ప్రక్రియ కొనసా గినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్ను శుక్లా వెల్లడించారు. స్థానిక ఈదరపల్లి మండల ప్రజా పరిషత్ పాఠశాల నందు 87 వ నెంబరు పోలింగ్ కేంద్రం నందు జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి హిమాన్ను శుక్లా తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. స్థానిక కలెక్టరేట్ లోని కమాండ్ కంట్రోల్ రూమ్ లో జిల్లా వ్యాప్తంగా జరుగు తున్న పోలింగ్ సరళిని ఆయన, జిల్లా ఎస్పి ఎస్. శ్రీధర్ వెబ్ కాస్టింగ్ ద్వారా వీక్షించి పర్యవేక్షించారు. స్థానిక మండల పరిధిలోని వేమవరం గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి హి మాన్ను శుక్లా, జిల్లా ఎస్పి ఎస్.శ్రీధర్ సందర్శించి పోలింగ్ సరళి విధానాన్ని క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. సాయంత్రం 6 గంటలకు క్యూలైన్లలో ఉన్న ఓటర్ల అందరికీ టోకెన్లు అందించి ఓటింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు వీలుగా ఫ్లడ్ లైటింగ్ ఏర్పాట్లు నిరంతరం విద్యుత్ సరఫరా ఏర్పాట్లు సుమారు 1600 పోలింగ్ కేంద్రాలలో కల్పించామని కలెక్టర్ తెలిపారు. **రామచంద్రపురం:** ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఓటర్లు ఉదయం 7 గంటలకే ఓటు హక్కు వినియోగించు కోవాలని క్యూలు కట్టారు. తోటపేట గ్రామంలోని 92వ పోలింగ్ బూత్ లో వివి పేడ్ నిర్వహించడంతో అర గంటసేపు ఓటింగ్ నిలిచిపోయింది. రామచంద్రపురం నియోజకవర్గం జిల్లాలో అతివేగంగా ఓట్లు నమోదు చేసి పోలింగ్లో ముందు శాతం లో నిలిచింది. **కపిలేశ్వరపురం:** మండలంలోని 19 గ్రామ పంచాయతీ పరిధిలో 54,075 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 26,867మంది, మహిళలు 27,208 మంది ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. **ఆత్రేయపురం :** మండలంలోని 17 గ్రామాలలో ఎన్నికలు స్వల్ప ఘర్షణ మధ్య ప్రశాంతంగా జరిగాయి 62 పోలింగ్ కేంద్రాల్లో 54,220 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు లొల్ల 37వ పోలింగ్ బూత్ లో ఈవీఎం సాంకేతి లోపంతో మొరాయించడంతో గంట ఆలస్యంగా ఓటింగ్ మొదలైంది. ఆత్రేయపురం లో టిడిపి, వైసిపి శ్రేణుల మధ్య ఘర్షణ ఏర్పడడంతో ఒకరినొకరు కవింపు చర్యలు దిగారు. పోలీసులు వచ్చి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. **మామిడికుదురు:** పెదపట్నం లంక, బి.దొడ్డవరం, అప్పనపల్లి పాశర్లపూడి, లూటుకుర్రు తదితర గ్రామాలలో కూటమి బలపరిచిన అమలాపురం పార్లమెంట్ టిడిపి అభ్యర్థి గంటి హరీష్ మాథూర్, కూటమి బలపరిచిన పి.గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ పోలింగ్ సరళి ని పరిశీలించారు. మామిడి కుదురు మండల పరిధిలో 18 గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసా గిందని పి.గన్నవరం సిఐ ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఆదురులో ఈవీఎంలు మోరాయించడంతో కొద్దిసేపు పోలింగ్కి అంతరాయం కలిగింది. **ఉప్పలగుప్తం:** మండలం లోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో గల 52 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాలలో ఇవిఎం లు మొరాయించడంతో పోలింగ్ సుమారు గంట సమయం ఆలస్యమై ఓటర్లు ఇబ్బంది పడ్డారు. కూటమి బలపరిచిన అమలాపురం నియోజకవర్గ టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి అయితా బత్తుల ఆనందరావు తన స్వగ్రామమైన ఎస్.యానాంలో ఓటు హక్కును వినియోగించుకోగా, గోపవరంలో మాజీ ఎంపీ ఎజెవి.బుచ్చి మహేశ్వరరావు ఆయన సతీమణి ఇందిర కుమార్తె సత్య శ్రీ, కుటుంబ సభ్యులు వినియోగించుకున్నారు. చల్లపల్లిలో ఇండిపెండెంట్ అభ్యర్థి వరసాల సత్యనారాయణ, జగ్గరాజుపేటలో వైసిపి నేత గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు ఆయన భార్య సునీత తల్లి సత్యవతి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. **రాజోలు:** నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. శివకోటి గ్రామంలో పోలింగ్ బూత్ ల వద్ద ఓటర్లకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమైనారు. **అంబాజీపేట:** పోలింగ్ ప్రక్రియలో భాగంగా అంబాజీపేట హైస్కూల్ నందు 116,117 బూత్‌లను వద్ద నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి శ్రీరామచంద్రమూర్తి సందర్శించారు. అంబాజీపేట, పుల్లేటికుర్రు పలు గ్రామాలలో గంటలు కావస్తున్నా ఈవిఎం లు మొరాయించడంతో పలు గ్రామాలలో అక్కడక్కడా వర్షం పడడంతో ఓటర్లు కొంత ఉపశమనం పొందారు. పి.గన్నవరం సిఐ ప్రశాంత్ కుమార్, అంబాజీపేట ఎస్ఐ చిరంజీవి ల ఆధ్వర్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. **ముమ్మిడివరం:** నగర పంచాయతీ పరిధిలోని పెట్టా వారి పేట 25వ పోలింగ్ బూత్ లోను, జెడ్‌పి బాలుర హైస్కూల్ పోలింగ్ బూత్ 16 ,17 కేంద్రాల్లో ఇవిఎం లు మొరాయించడంతో అరగంట లేటుగా పోలింగ్ ప్రారంభమైంది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి 74.61 శాతం పోలింగ్ నమోదయింది. ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ తమ కుటుంబ సభ్యులతో కలిసి నగర పంచాయతీ పరిధిలోని 16వ వార్డు ప్రాంతమైన చిప్పలపాలెం పోలింగ్ బూత్ నెంబర్ 28 లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే కూటమి బలపరిచిన ముమ్మిడివరం నియోజకవర్గం టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి దాట్ల సుబ్బరాజు భార్యతో కలిసి మురమళ్ళ పోలింగ్ బూత్ 141 కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇతర రాష్ట్రాలు మరియు విదేశాల నుంచి సుమారు 8 నుండి 10 వేల మంది ఓటర్లు నియోజకవర్గానికి వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే ఐ.పోలవరం మండలం తిల్లకుప్పలో వైసిపి, టిడిపి కార్యకర్తలు మధ్య వివాదం తోపులాటకు దారితీసింది. **కొత్తపేట** వాడపాలెం పోలింగ్ బూత్ 168 లో కూటమి బలపరిచిన కొత్తపేట నియోజకవర్గ టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి బండారు సత్యానందరావు తన ఓటు హక్కును వినియోగించు కున్నారు. **ఆలమూరు:** పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావ రణంలో కొన సాగిందని మండల ఎన్నికల అధికారి, తహశీల్దార్ డివిఎన్.అనిల్ కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు క్యూలైన్లలో ఉన్న ఓటర్ల అందరికీ టోకెన్లు అందించామన్నారు.

అంబాజీపేట మండలంల వక్కలంక గ్రామంలో బారులు తీరిన ఓటర్లు

అప్పనపల్లిలో వికలాంగుడిని పోలింగ్ కేంద్రానికి తీసుకువెళుతున్న కుటుంబ సభ్యులు

వేగాయమ్మ పేటలో ఎండలో క్యూకట్టిన ఓటర్లు

జగ్గరాజుపేటలో ఓటు హక్కు వినియోగించుకున్న రమణారావు కుటుంబం

'సీ విజిల్' ద్వారా ఫిర్యాదులపై చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనల పై సీ విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు ఈ విధంగా ఉన్నాయని సిపిఒ, సీ విజిల్ యాప్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీ విజిల్ యాప్ ద్వారా పౌరుల నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనల పై అందిన ఫిర్యాదులు రోజువారి నివేదిక ప్రకారం మే 12న 21 ఫిర్యాదులు ఎన్నికల ప్రవర్తన నియమాలు ఉల్లంఘనలపై ఫిర్యాదులు అందగా మూడు ఫిర్యాదులు ప్రవర్తన నియమానికి సంబంధించినవి కావని ధృవీకరించామన్నారు. మిగిలిన 18 ఫిర్యాదుల్లో వంద నిమిషాల్లోపు 17 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. ఒక ఫిర్యాదును 100 నిమిషాల పైబడి పరిష్కరించామని సిపిఒ జిల్లా, సీ విజిల్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. సీ విజిల్ యాప్ ద్వారా మార్చి నెల 16వ తేదీ నుంచి మే 12 వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి 1001 ఫిర్యాదులు రాగా వాటిలో 143 ఫిర్యాదులు ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించినవి కావని ధ్రువీకరించామని అన్నారు. మిగిలిన ఫిర్యాదులు 858 ఉండగా వాటిలో 810 ఫిర్యా దులను వంద నిమిషాల్లోపు పరిష్కరించామన్నారు. 48 ఫిర్యాదులను వంద నిమిషాల పైబడిన తర్వాత పరిష్కరించామన్నారు.

తాళ్ల పొలం వద్ద బస్సుల్లో హైదరాబాద్‌కు ప్రయాణమైన ఓటర్లు

హైదరాబాద్ నుంచి 150 బస్సుల్లో ఓటర్ల తరలింపు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన ఓటర్లు హైదరాబాదులో ఉద్యోగాలు చేస్తున్న వారందరినీ రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున తరలించాయి. టిడిపి అభ్యర్థి సుమారు 100 బస్సుల్లో ఓటర్లను రామచంద్ర పురానికి తరలించగా వైసిపి 50 బస్సుల్లో ఓటర్లను తరలించినట్లు అంచనా. మొత్తం సరాసరి 10 వేల మంది ఓట్లు వేయడానికి హైదరాబాద్ నుంచి రామచంద్రపురం తరలివచ్చారు. వచ్చిన వారందరికీ ఉచిత బస్సు ప్రయాణంతో పాటు ఆయా పార్టీలు భోజన సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో పెద్ద ఎత్తున ఓటర్లు రామచంద్రపురం చేరుకుని సోమవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరంతా తిరిగి సోమవారం రాత్రి తిరుగు ప్రయాణం అవడంతో ప్రయివేటు బస్సులు నిలుపుదల చేసిన చోట ప్రయాణికులు హడావుడి కనిపించింది. మొత్తం మీద సంక్రాంతి తర్వాత మళ్లీ ఓటింగ్ లో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున ఆయా గ్రామాలకు చెందిన ఓటర్లు స్వగ్రామాలకు చేరుకోవడంతో అన్ని గ్రామాల్లోనూ పండగ వాతావరణం నెలకొంది.

శిథిలావస్థకు చేరిన బస్టాండ్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలం లోని లొల్ల రేవులో ఉన్న బస్టాండ్ శిథిలావస్థకు చేరి అధ్వానంగా తయారయింది. ప్రయాణికులు బస్సు కోసం నిరీక్షించే ప్రదేశం అధ్వానంగా ఉండటంతో ప్రయాణికులు కూర్చుని బల్లలు విరిగిపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ బస్సు స్టాండ్ లో దీపాలు లేకపోవడంతో రాత్రి సమయంలో బస్సు కోసం వేచి ఉండే ప్రయాణికుల అవస్థలు పడుతున్నారు. శనివారం వచ్చిందంటే చాలు యాత్రికులు ఈ బస్టాండ్లో. బస్సు కోసం వేచి ఉండాలంటే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు పంట కాలువ చెంతనే ఈ బస్టాండ్ ఉండడంతో కాలువలోంచి ఈ బస్టాండ్ లోకి పాములు చేరుతున్నాయి. ఉన్నతాధికారులు కలగజేసుకుని ఈ బస్టాండ్ ని శుభ్రం చేయించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

బస్టాండ్‌లో విరిగిపోయిన బల్లలు

ఓటు హక్కు వినియోగించుకున్న నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో వివిధపార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, సార్వత్రిక ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. **రామచంద్రపురం:** సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి పిల్లి సూర్య ప్రకాష్ తన స్వగ్రామమైన హసన్ బాద లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ హసన్ బాదలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా కూటమి బలపరిచిన రామచంద్రటమ బతెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ పట్నంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరితో పాటుగా జనసేన పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, మిగిలిన పార్టీ నాయకులు సోమవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. **కపిలేశ్వరపురం:** మండపేట నియోజకవర్గం వైసిపి అభ్యర్థి, ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు మండపేట సత్య శ్రీ రోడ్డులోని ఎస్‌వివి.మున్సిపల్ స్కూల్లో పోలింగ్ బూత్ నెంబర్ 105 లో సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన తో బాటు ఆయన సతీమణి తోట సూర్య కుమారి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం అక్కడికి చేరుకొని తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయనతోపాటు మండపేట వైసిపి పట్టణ కార్యదర్శి, టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు తదితరులు ఉన్నారు. **మామిడికుదురు:** నగరం పోలింగ్ కేంద్రంలో పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు, లక్ష్మీ దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూ లైన్లో నిలుచుని ఓటు వేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఓటర్లలో చైతన్యం పెరిగి రెట్టించిన ఉత్సాహంతోఓటర్లు ఓటింగ్ లో పాల్గొన్నారు. **ఐ.పోలవరం:** మండలం మురమళ్ల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న జెడ్‌పి ఉన్నత పాఠశాల 141పోలింగు కేంద్రం వద్ద ఓటు వేస్తున కూటమి బలపరిచిన ముమ్మిడివరం నియోజకవర్గ టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి దాట్ల సుబ్బరాజు ఓటు వేశారు.

ఓటు వేస్తున్న దాట్ల సుబ్బరాజు

ఒకే చోటు నాలుగు కేంద్రాల్లో గందరగోళంగా ఉన్న ఓటర్లు

ఒకే చోట 4 పోలింగ్ కేంద్రాలు

ప్రజాశక్తి - దేవరపల్లి

దేవరపల్లిలోని మెయిన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్లు గందరగోళానికి గురి కావడంతో పాటు అవస్థలు పడ్డారు. ఒకే ప్రాంతంలో నాలుగు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయడంతో ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు బారులు తీరి క్యూలైన్లో నిలిచేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కిక్కిరిసిన జనంతో పాఠశాల ప్రాంగణం అంతా నిండిపోవడంతో ఓటర్లు ఇబ్బందులకు గురయ్యారు. అయినా ఓటు వేసేందుకు ఓపికగా నిరీక్షించారు. నాలుగు పోలింగ్ బూత్ కేంద్రాలను ఒకే చోట కాకుండా రెండు పోలింగ్ బూత్‌లను హైస్కూల్లో ఏర్పాటు చేసి ఉంటే ఇన్ని ఇబ్బందులు ఉండవని ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. పోలింగ్ సమయం ముగుస్తున్న సమయంలో ఓటర్లు అధిక సంఖ్యలో ఓట్లు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు.

జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్‌కు ఏజెంట్ పాస్‌పై అభ్యంతరం

ప్రజాశక్తి-తాళ్లపూడి

తాళ్లపూడి జెడ్‌పిటిసి, జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖకు అధికారులు పోలింగ్ ఏజెంట్‌గా పాస్ ఇవ్వడం ఏమిటని టిడిపి శ్రేణులు అభ్యంతరం తెలుపుతూ కొవ్వూరు ఆర్ఒకు ఫిర్యాదు చేశారు. శ్రీలేఖకు అన్నదేవరపేట పోలింగ్ బూత్‌లో ఏజెంట్ పాసు మంజూరు చేశారు. ఆమె పోలింగ్ కేంద్రానికి వెళ్ళేటప్పటికి అక్కడ ఉన్న టిడిపి శ్రేణులు కాకర్ల సత్యనారాయణ, కూచిపూడి గణపతి అభ్యంతరం తెలపడంతో కొంతసేపు అక్కడ వాదోపవాదనలు జరిగాయి. ప్రజా ప్రతినిధిగా ఉంటూ ఏజెంట్ పాస్ తీసుకోవడం ఏమిటని అధికారులకు తప్పుడు సమాచారం అందించి ఉంటారని టిడిపి శ్రేణులు ఆరోపించాయి. దీంతో జెడ్‌పి వైఎస్ చైర్‌పర్సన్‌కు ఇచ్చిన పాస్‌ను రద్దు చేశారు.

వివాదాల నడుమ పోలింగ్

ప్రజాశక్తి - సీతానగరం

మండలవ్యాప్తంగా ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమైంది. సీతానగరం మండలంలో 87 శాతం పోలింగ్ నమోదయ్యింది. 9 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూ లైన్లలో నిలబడి ఎండ వేడిమి తట్టుకోలేక పోయారు. మధ్యాహ్నం తరువాత ఓటర్లు భారీ సంఖ్యలో ఓటు వినియోగించుకున్నారు. కొన్ని చోట్ల చిన్నపాటి వివాదాలు చోటు చేసుకున్నాయి. ఇనుగంటివారిపేట, రఘుదేవపురం, రాపాక, సీతానగరం, చినకొండేపూడి, వంగలపూడిలో వివాదాలు చెలరేగాయి. రామచంద్రపురం, పురుషోత్తపట్నం పోలింగ్ కేంద్రాల వద్ద గుర్తు తెలియని వ్యక్తులు హల్ చల్ చేయడంతో వివాదాలు చోటు చేసుకుని కొట్లాటకు దారి తీశాయి. రాజానగరం నియోజకవర్గంలో 81 శాతంతో 21,64,91 మంది ఓటర్లకు గాను రాత్రి తొమ్మిది గంటల వరకూ 17,52,85 మంది ఓట్లు వేశారు. కొన్ని కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసినా కొన్ని కేంద్రాల్లో ఇంకా క్యూలో నిలబడి ఓట్లు వేయడానికి ఓటర్లు సిద్ధంగా ఉన్నారు.వివాదాల నడుమ పోలింగ్ జరుగుతుంది.

గులాబీ పూల పంపిణీతో వివాదం

ప్రజాశక్తి-రాజానగరం

నియోజకవర్గంలో హౌసింగ్ బోర్డు కాలనీలో మహిళా పోలీగ్ కేంద్రంలో ఓటర్లకు గులాబీ పువ్వులు పంపిణీ చేస్తుండగా కాంగ్రెస్ అభ్యర్థి ముండ్రు వెంకట శ్రీనివాస్ అడ్డుకున్నారు. రాజమహేంద్రవరం బిజెపి ఎంపి అభ్యర్థి గుర్తు కమలం అయితే గులాబీ పువ్వులు ఎలా పంపిణీ చేస్తారని ఆయన ప్రశ్నించారు. మండలంలో కలవచర్లలో పోలీసులకు స్థానిక యువకులకు వాగ్వివాదం చోటు చేసుకుని స్వల్ప ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి. దివాన్ చెరువు పోలింగ్ కేంద్రం సమీపంలో జనసేన పార్టీ కార్యకర్తలు హంగామా సృష్టిస్తుంటే పోలీసులు చెల్లాచెదురు చేశారు.

మొరాయించిన ఇవిఎంలు

ప్రజాశక్తి-తాళ్లపూడి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తాళ్లపూడి మండలంలో ప్రశాంతంగా ముగిసింది. కొన్నిచోట్ల ఇవిఎంలు పనిచేయకపోవడంతో ఉదయం 7:30 గంటలు దాటే వరకు కొన్నిచోట్ల పోలింగ్ ప్రారంభం కాలేదు. పక్క పక్కనే రెండు పోలింగ్ కేంద్రాల ఉన్నప్పటికీ ఒకచోట మిషన్లు పనిచేసి మరోచోట పనిచేయకపోవడంతో అక్కడ ఉన్న ఓటర్లు నిరాశక్తత వ్యక్తం చేశారు. రాత్రి సుమారు 7 గంటలు దాటాక కూడా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరి ఉండడంతో అధికారులు వారికి స్లిప్పులు ఇచ్చి ఓటింగ్‌కు అవకాశం కల్పించారు. ఓటర్లకు నీడ కల్పించేందుకు ఎండకు తగ్గట్టుగా అధికారులు ఏర్పాటు చేయలేదని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన వాలంటీర్లు జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ పోలింగ్ ఏజెంట్లుగా పాసులు తీసుకోవడంతో మిత్రపక్ష నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

ఇవిఎంలు మొరాయించడంతో బారులు తీరిన జనం

ప్రక్కిలంకలో పోలింగ్ కేంద్రానికి దగ్గరలోని ఇంటి వద్ద ప్రజలు ఉండడంతో పోలీసులు అదిలించడంతో గ్రామస్తులకు పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది.

ఎల్లలు దాటి వచ్చి ఓటు హక్కు

ప్రజాశక్తి-గోపాలపురం

సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు విదేశాల నుంచి కూడా భారతీయులు తరలివచ్చి వారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. గోపాలపురం కొండవీటి విద్యాసంస్థలు కరస్పాండెంట్ కెఎస్‌డి.ఆశీర్వాదం వారి కుమార్తె కొండవీటి టీనా, ఆమె భర్త తాడిపర్తి శామ్యూల్ సందేశ్ దంపతులు ఇద్దరు అమెరికాలోని నార్త్ డకోటా స్టేట్, ఫార్గోలో నివాసం ఉంటున్నారు. తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు గోపాలపురం 29వ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా ఆమె భర్త శామ్యూల్ సందేశ్ మచిలీపట్నం స్వగ్రామం వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ దంపతులు ఇద్దరూ రూ.లక్షలు ఖర్చు చేసుకుని ఓటు వేయడానికి స్వదేశానికి వచ్చి వారి కర్తవ్యాన్ని నెరవేర్చడం విశేషం. ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో ఓటు ఎంతో కీలకం. అటువంటి ఓటును విదేశాల నుంచి వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవడం చాలా ఆనందంగా ఉందని టీనా దంపతులు తెలిపారు. రాష్ట్ర, దేశ భవిష్యత్తు ఓటు పైనే ఆధారపడి ఉందని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటు వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల పండుగలో భాగస్వామ్యం అయ్యేందుకు ఎల్లలు దాటి స్వదేశానికి వచ్చి పలువురు ఓటు హక్కును వినియోగించుకున్న వారిని పలువురు అభినందించారు.

ఓటు వినియోగించుకున్న టీనా

ఓటేసి.. మృతి చెందాడు

ప్రజాశక్తి -మామిడికుదురు

గోగన్నమఠం గ్రామానికి చెందిన కర్రి సత్యనారాయణ (52) సోమవారం తన ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం మృతి చెందాడు. అదే గ్రామంలోని 203వ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకుని తన నివాసానికి చేరుకున్నాడు. కొద్దిసేపటికే ఫిట్స్ రావడంతో బంధువులు రాజోలు ప్రభుత్వాసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

హైదరాబాద్ నుంచి బైకుపై వచ్చిన కుటుంబం

హైదరాబాద్ నుంచి బైకుపై..

ప్రజాశక్తి కాకినాడ రూరల్

మండలంలోని కొన్వాడ గ్రామానికి చెందినకొప్పిశెట్టి శ్రీను ఉద్యోగ నిమిత్తం తన భార్య లక్ష్మి ఇద్దరు పిల్లలతో హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు వినియోగించుకునేందుకు శ్రీను, లక్ష్మి తన ఇద్దరు పిల్లలను తీసుకుని తన యాక్టివా బైక్‌పై హైదరాబాద్‌లోని పంజాగుట్ట నుండి బయలుదేరి కాకినాడ రూరల్‌లోని తన స్వగ్రామమైన కొవ్వాడ వచ్చాడు. 116వ పోలింగ్ కేంద్రంలో తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇందుకు తాము ఆదివారం ఉదయం 4 గంటలకు బయలుదేరి రాత్రి 8 గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకున్నామని చెప్పారు. ఈ రోజు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.

పోలింగ్ వేళ సిత్రాలు

కుటుంబంతో కలిసి ఓటేసిన తూర్పు గోదావరి కలెక్టర్ మాధవీలత

తాళ్లపూడిలో రాత్రి వేళ ఓటు కోసం నిరీక్షిస్తున్న ఓటర్లు

చాగల్లులో బారులు తీరిన మహిళా ఓటర్లు

ఓటు కోసం క్యూలైన్‌లో ఉన్న కోనసీమ ఎస్‌పి

యు.కొత్తపల్లిలో వైసిపి నేత కారును అడ్డుకున్న టిడిపి నాయకులు

పిఠాపురంలో ఎండ వేడిమికి చెట్ల కింద సేద తీరుతున్న ఓటర్లు

ఉప్పలగుప్తంలో వీల్ చైర్‌లో వస్తున్న మహిళ

తూర్పు గోదావరి మొత్తం ఓట్లు : 16,23,149

నియోజకవర్గం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
రాజమండ్రి	2,67,484	176419	65.95
రాజమండ్రి రూరల్	2,72,826	197840	72.52
అనపర్తి	2,26,053	182873	80.90
రాజానగరం	2,16,491	175285	80.97
కొవ్వూరు	1,84,136	149782	81.34
నిడదవోలు	2,13,396	167439	78.46
గోపాలపురం	2,42,763	196919	81.12

కాకినాడ జిల్లా మొత్తం ఓట్లు : 16,34,122

నియోజకవర్గం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
కాకినాడ	2,41,620	174446	70.02
కాకినాడ రూరల్	2,69,330	169180	71.91
పిఠాపురం	2,36,409	193831	78.18
జగ్గంపేట	2,29,863	157478	75.89
ప్రత్తిపాడు	2,17,267	184820	73.18
తుని	2,24,538	158877	71.14
పెద్దాపురం	2,15,095	159732	73.21

డా.బిఆర్.అంబేద్కర్ కోనసీమ మొత్తం ఓట్లు : 15,31,410

నియోజకవర్గం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
అమలాపురం	2,13,508	1,66,899	79.17
రాజోలు	1,97,920	1,48,281	74.92
పి.గన్నవరం	1,98,602	1,50,639	75.85
ముమ్మిడివరం	2,45,296	1,59,466	76.99
కొత్తపేట	2,52,383	1,95,092	77.30
మండపేట	2,20,494	1,88,853	78.97
రామచంద్రపురం	2,03,207	1,68,641	82.99

ఓటెత్తారు...

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తారు. ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల రద్దీ కనిపించింది. వందలాది మంది బారులు తీరారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఇతర ప్రాంతాల్లో ఉంటున్న ఓటర్లు సైతం జిల్లాకు రావడంతో ఓటింగ్ శాతం పెరిగింది. రాత్రి 11 గంటలు దాటినా పలుప్రాంతాల్లో పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. పలువురు ప్రముఖులు సైతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. తూర్పు, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు సైతం ఆయా జిల్లాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కపిలేశ్వరపురంలో ఉదయం 8గంటలకే బారులు తీరిన ఓటర్లు

వెబ్ కాస్టింగ్

తాళ్లరేవులో కిక్కిరిసిన ఓటర్లు

కాకినాడలో ఉదయం 7గంటలకు...

కాకినాడలో ఓటుహక్కును వినియోగించుకున్న ట్రాన్స్‌జెండర్లు

పిఠాపురంలో బారులుతీరిన ఓటర్లు

మొదటిసారి ఓటు వేసిన యువతులు

ఓటు వినియోగించుకున్న ప్రముఖులు

హిమాన్షు శుక్లా, కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ
జి.నివాస్ కాకినాడ జిల్లా కలెక్టర్
డాక్టర్ కె.మాధవీలత తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్

గూడూరి శ్రీనివాస్ వైసిపి రాజమండ్రి ఎంపీ అభ్యర్థి
చలమలశెట్టి సునీల్ వైసిపి కాకినాడ ఎంపీ అభ్యర్థి
హరీష్ మాథూర్ టిడిపి అమలాపురం ఎంపీ అభ్యర్థి

పల్లం రాజు కాంగ్రెస్ కాకినాడ ఎంపీ అభ్యర్థి
తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ జనసేన కాకినాడ ఎంపీ అభ్యర్థి
రాపాక వరప్రసాదరావు వైసిపి అమలాపురం ఎంపీ అభ్యర్థి

దగ్గుబాటి పురంధేశ్వరి బిజెపి రాజమండ్రి ఎంపీ అభ్యర్థి
గిడుగు రుద్రరాజు కాంగ్రెస్ రాజమండ్రి ఎంపీ అభ్యర్థి
అయితాబత్తుల ఆనందరావు టిడిపి అమలాపురం అభ్యర్థి

జక్కంపూడి రాజా రాజానగరం ఎంఎల్‌ఎ
జ్యోతుల నెహ్రూ టిడిపి జగ్గంపేట అభ్యర్థి
కురసాల కన్నబాబు కాకినాడ రూరల్ ఎంఎల్‌ఎ

మార్గాని భరత్‌రామ్ రాజమండ్రి ఎంపీ
మారోతు శివగణేష్ కాంగ్రెస్ జగ్గంపేట అభ్యర్థి
పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ ముమ్మిడివరం ఎంఎల్‌ఎ

అరిగెల అరుణకుమారి కొవ్వూరు కాంగ్రెస్ అభ్యర్థి
బాలేపల్లి మురళీధర్ రాజమండ్రి కాంగ్రెస్ అభ్యర్థి
ఆదిరెడ్డి వాసు టిడిపి రాజమండ్రి సిటీ అభ్యర్థి
ఆదిరెడ్డి భవాని ఎంఎల్‌ఎ, రాజమండ్రి సిటీ
పెండెం దొరబాబు పిఠాపురం ఎంఎల్‌ఎ
కొండేటి చిట్టిబాబు పి.గన్నవరం కాంగ్రెస్ అభ్యర్థి
దాడిశెట్టి రాజా ఆర్అండ్ బి శాఖ మంత్రి, తుని
పినిపే విశ్వరూప్ రవాణా శాఖ మంత్రి, అమలాపురం
దేవ వరప్రసాద్ రాజోలు జనసేన పార్టీ అభ్యర్థి
యనమల దివ్య తుని టిడిపి అభ్యర్థి
గేలం శ్రీనివాసరావు తుని కాంగ్రెస్ అభ్యర్థి
తానేటి వనిత హోం మంత్రి, గోపాలపురం

తోట త్రిమూర్తులు వైసిపి మండపేట అభ్యర్థి
వంగా గీత వైసిపి పిఠాపురం అభ్యర్థి
పిల్లి సుభాష్ చంద్రబోస్ రాజ్యసభ సభ్యుడు, రామచంద్రపురం
నిమ్మకాయల చినరాజప్ప ఎంఎల్‌ఎ, పెద్దాపురం
తలారి వెంకట్రావు ఎంఎల్‌ఎ, గోపాలపురం
యనమల రామకృష్ణుడు మాజీ మంత్రి, తుని
పిల్లి సూర్యప్రకాష్ వైసిపి రామచంద్రపురం అభ్యర్థి
వాసంశెట్టి సుభాష్ టిడిపి రామచంద్రపురం అభ్యర్థి
సానా బుచ్చిబాబు చలనచిత్ర దర్శకుడు
జ్యోతుల చంటిబాబు ఎంఎల్‌ఎ, జగ్గంపేట
రెడ్డి సుబ్రహ్మణ్యం శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్
వనమాడి కొండబాబు టిడిపి కాకినాడ అభ్యర్థి

నల్లమిల్లి రామకృష్ణారెడ్డి టిడిపి అనపర్తి అభ్యర్థి
సరెళ్ల ప్రసన్నకుమార్ కాంగ్రెస్ రాజోలు అభ్యర్థి
పంతం నానాజీ జనసేన కాకినాడరూరల్ అభ్యర్థి